క్లుప్తంగా

బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



11వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను శుక్రవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వార్డులో ఇప్పటికే రూ.కోట్లు నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో రూ.26 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, పార్టీ స్థానిక నాయకులు ఎం.రాము, మక్బుల్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

మందుబాబు వీరంగం

బీచ్ రోడ్డు: మద్యం సేవించి వాహనం నడపటమే కాకుండా రోడ్డు మీద వీరంగం సృష్టించాడు ఓ వ్యక్తి. దీంతో కాసేపు సిరిపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. మద్యం మత్తులో డి.రోహిత్‌కుమార్ అనే వ్యక్తి కారు నడుపుతూ ముందు వెళ్తున్న కారుని ఢీకొట్టాడు. సదరు వాహనదారుడు వచ్చి నిలదీయగా.. రోహిత్ ఎదురు దాడికి దిగాడు. దీంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం రోహిత్‌పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.

ఘనంగా పీడియాట్రిక్స్ సర్జరీ దినోత్సవం



పిల్లలతో తల్లిదండ్రులు, వైద్యులు

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని రెయింబో చిల్డ్రన్ ఆస్పత్రిలో శుక్రవారం పీడియాట్రిక్స్ సర్జరీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలో ఇటీవల సర్జరీలు జరిగి ఆరోగ్యంతో ఉన్న చిన్నారులు ఆటలాడుతూ ఇక్కడ సందడి చేశారు. పీడియాట్రిక్స్ విభాగం వైద్యురాలు డాక్టర్ రవి హిమజ, ఆస్పత్రి వైద్యులు శశ్విత్ మొహంతి, యశ్వంత్ రెడ్డి, విశాల్, అన్వేష్ అమిత్, బాల శ్రీలత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెప్టెన్ విజయకాంత్ మృతికి సంతాపం

మద్దిలపాలెం : తమిళ నటుడు కెప్టెన్ విజయకాంత్ అకాల మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ మేరకు విజయకాంత్ కుటుంబానికి ఈ మెయిన్ ద్వారా తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మరణం చలన చిత్ర రంగానికి తీరని లోటు అని నరవ పేర్కొన్నారు.

ఇది కదా అభివృద్ధి







రూ.3.5 కోట్లతో ఊటగెడ్డ పార్కు ఆధునికీకరణ



మట్టి దిబ్బలు.. మురుగునీరు.. ముళ్ల పొదళ్లతో భయానకంగా ఉండే ఆ ప్రాంతం ఇప్పుడు ఎంతో సుందరంగా, ఆహ్లాదకరంగా దర్శనమిస్తోంది. 2019 ఏడాదికి ముందు అటువైపు కన్నెత్తి చూడని స్థానిక ప్రజలకు ఇప్పుడా ఆ ప్రాంతం ఎంతో కనువిందు చేస్తోంది. జీవీఎంసీ 28వ వార్డు ఊటగెడ్డను ఆనుకొని ఉన్న ప్రాంతాన్ని రూ.3.5 కోట్లతో గోకుల కృష్ణ పార్కు పేరిట అభివృద్ధి చేశారు. ఇప్పటి వరకు కళా విహీనంగా ఉండే ఆ ప్రాంతం ఇప్పుడు సుందరంగా ముస్తాబైంది. పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్‌లను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక కాలనీ వాసులతో పార్కు సందడిగా ఉంటోంది.

\- బీచ్ రోడ్డు

ఏయూ సమాచారం...

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్ స్టీఫెన్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రవి విన్సెంట్ రచించిన ఇంగ్లిష్ ఫ్రేసల్ వెర్బ్స్ విత్ సూపర్ ఈజీ ఎగ్జాంపుల్స్ పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆంగ్ల పద జాలం, క్రియలు ఆంగ్ల భాషను మరింత సుసంపన్నం చేయడానికి ఉపకరిస్తాయని, ఆంగ్ల భాషను నేర్చుకుని, సమర్థవంతంగా కమ్యూనికేషన్ చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆంగ్ల భాష ప్రావీణ్యం పొందాలనుకునే వారికి వాటి అర్థాన్ని, వినియోగాన్ని తెలుసుకోవడం, వివిధ సందర్భాలలో ఆంగ్ల పదజాలాలను ఏ విధంగా ఉపయోగించాలో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సాల్మన్ బెన్నీ, రీసెర్చ్-డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె.బసవయ్యలు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏయూ విద్యార్థుల ఎంపిక

ఏయూ క్యాంపస్: దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల పరేడ్‌లో ఏయూ జాతీయ సేవా పథకం తరఫున పాల్గొనడానికి ఇద్దరు వలంటీర్లు ఎంపికైనట్లు వర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ పరిధిలోని సెయింట్ జోసఫ్ కళాశాలకు చెందిన కె.కేదార్‌శ్రీ, ఎంఆర్ కళాశాలకు చెందిన ఎస్.కల్యాణి ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది విద్యార్థులు ఎంపిక కాగా.. వారిలో ఇద్దరు ఏయూ విద్యార్థులు కావడం గమనార్హం. వీరు జనవరి 1 నుంచి నెల రోజుల పాటు ఢిల్లీలో జరిగే ప్రత్యేక శిక్షణ, వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఆడుదాం.. ప్రతిభ చాటుదాం..



ఖోఖో ఆడుతున్న యువతులు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. యువతీ యువకులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణిస్తున్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీలకు మంచి స్పందన వస్తోంది. ఇండోర్ స్టేడియం(జిమ్నాజియం)లో నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ, యువతలో ప్రతిభను వెలికితీసే విధంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా సంబరం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

'పిల్లలూ.. బాగా చదువుకోండి'



ముస్తఫా కాలనీ పాదయాత్రలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ..

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాదయాత్ర చేపట్టారు. ఆయా సచివాలయాల పరిధిలో అంబేడ్కర్‌నగర్, పార్వతినగర్, సుందరయ్యనగర్, భరత్ నగర్, డ్రైవర్స్‌కాలనీ, ముస్తఫాకాలనీలలో గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. వాటి వల్ల కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాలలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ అందించే సౌకర్యాలు, సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ప్రజలతో పాటు విద్యార్థులు సైతం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, నగరాల డైరెక్టర్ కె.మోహనరావు, సంచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంకు పటిష్ట భద్రత



ఈవీఎం గోదాంలో వీవీ ప్యాడ్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ : ఈవీఎం గోదాంకు మరింత పటిష్టమైన భద్రత కల్పించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదేశించారు. రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను పలు రాజకీయ పార్టీల నాయకులతో కలసి నెలవారీ తనిఖీలలో భాగంగా సందర్శించారు. అక్కడ వీవీ ప్యాడ్‌లు తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు పనితీరు, కల్పిస్తున్న భద్రతపై ఆరా తీశారు. ఇక్కడ గోదాంకు భద్రత ప్రమాణాలతో కూడిన చర్యలు పాటించాలని సూచించారు.

జగనన్న నాయకత్వమే అభివృద్ధికి ముందడుగు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వమే రాష్ట్ర అభివృద్ధిని ముందుకు నడిపిస్తుందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని 18వ వార్డులో జరిగిన «ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే»కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను సంక్షేమం దిశగా, సామాజిక ప్రగతి దిశగా నడిపించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం దేశ చరిత్రలో ఏదీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు పుక్కళ్ల శంకర్, వాసుపల్లి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మిస్ అండ్ మిస్సెస్ ఫ్యాషన్ షో



షోలో పాల్గొన్న వనితలతో స్టార్ మేకర్ సత్యానంద్

ఎంవీపీ కాలనీ: వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో మిస్ అండ్ మిస్సెస్ ఫ్యాషన్ షోను ఉత్సాహంగా నిర్వహించారు. క్వీన్ ఈవెంట్స్ నిర్వాహకురాలు ఉషారాణి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నగర మహిళల్లో పోటీ తత్వాన్ని, చైతన్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పోటీలకు వంద మంది రిజిస్టర్ చేసుకోగా, 30 మంది ఫైనల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వారిలో మిస్ కేటగిరిలో పావనీ విన్నర్‌గా, మిస్సెస్ కేటగిరిలో దివ్య విన్నర్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో చిన్నారులు పలు పాశ్చాత్య గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో స్టార్ మేకర్ సత్యానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కృష్ణకుమార్‌కు వెంపటి రవిశంకర్ జీవన సాఫల్య పురస్కారం



కృష్ణకుమార్‌కు వెంపటి రవిశంకర్ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

మద్దిలపాలెం : విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు పరంపర నృత్యోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 2023 సంవత్సరానికి గాను వెంపటి రవిశంకర్ జీవన సాఫల్యా పురస్కారాన్ని కాకినాడకు చెందిన ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ కృష్ణకుమార్‌కు సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు ప్రదానం చేశారు. అనంతరం నగరానికి చెందిన ప్రముఖ వర్ధమాన కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నటరాజ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ లక్ష్మి శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అతిథులు సూరపనేని విజయకుమార్, డాక్టర్ శ్రీధర్, గురు హరిరామమూర్తి, కంకటాల మల్లికార్జున, టేకుమల్ల శ్యామల సీతారామస్వామి, ఫెస్టివల్ డైరెక్టర్ బత్తిన విక్రమ్ కుమార్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన



సదస్సులో అవగాహన కల్పిస్తున్న వక్తులు

బీచ్ రోడ్డు: కొత్తగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలకునే ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించినట్లు బిందు ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్ సొసైటీ వ్యవస్థాపకురాలు హిమబిందు తెలిపారు. శుక్రవారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు విభాగం జేడీ శ్రీనివాసరావు, ఖాదీ బోర్డు సీఈవో నాయక్, ఖాదీ విలేజ్ డైరెక్టర్ గ్రీప్ పాల్గొని పథకాలు, రుణాల మంజూరుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 900 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం అవసరం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
- విశాఖ వ్యాలీ స్కూల్‌లో ముగిసిన స్పోర్ట్స్ మీట్



క్రీడా జ్యోతితో కలెక్టర్ మల్లికార్జున



కరాటే విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆరిలోవ: చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్, విశాఖ వ్యాలీ స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులతో కలిసి క్రీడా జ్యోతి వెలిగించి మైదానంలో తిరిగారు. ఈ సందర్భంగా ఆయన ఆర్చరీలో బాణం చేతపట్టి లక్ష్యాన్ని గురిపెట్టారు. ఇందులో భాగంగా విద్యార్థుల క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరాటే విద్యార్థులు మంటలు వెలిగించిన రింగుల నుంచి దూకడం, వరుసుగా ఉన్న ఇటుకలను పగలుగొట్టి అబ్బురపరిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత అవసరమో.. క్రీడల్లో రాణించడం కూడా అంతే ముఖ్యమన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా క్రీడా సాధన చేసి మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. దీనివల్ల మెదడు చక్కగా పని చేస్తుందన్నారు. పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా మెలగాలన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో స్ఫూర్తి పేరుతో స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడల కోసం విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల మ్యాగజైన్ ఆవిష్కరించి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో అతిథులు డీటీసీ రాజారత్నం, విశ్రాంత ఏడీసీపీ టి.ఎస్.ఆర్.ప్రసాద్, ఏఎంఎన్ఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హెడ్ డి.ఎస్.వర్మ, వాల్తేరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కమల్‌జిత్, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ కె.సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం పరిశీలన

అనంతరం పాఠశాల పక్కన రూ.6 కోట్లతో చేపడుతున్న కొత్త భవన నిర్మాణాన్ని కలెక్టర్ సందర్శించారు. పనులు ఎంత వరకు వచ్చాయో అక్కడ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం పనులు త్వరగా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

హస్తకళల పరిరక్షణ అందరి బాధ్యత



స్టాల్స్‌ను సందర్శిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

బీచ్ రోడ్డు: హస్తకళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఉన్న స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, నిర్వాహకులు దేవకి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

2.5 కేజీల గంజాయి స్వాధీనం

బీచ్ రోడ్డు: గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 2.5 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్, మూడో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద అక్రమ రవాణ జరుగుతుందని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన ఎస్.మత్యాగిరి, ఎ.శివ నుంచి 2.5 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలయ్యేలా..

ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారుకి చేరేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. నవరత్నాల సంక్షేమ ఫలాలు అందరికీ అందేందుకు మండలాల వారీగా పర్యవేక్షణ అవసరమని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల పర్యవేక్షణకు 11 మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల పరిధిలో ఉన్న సచివాలయాల పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ పింఛను కానుక, చేయూత, ఆసరా తదితర కార్యక్రమాల నిర్వహణ, అమలుపై సచివాలయ సిబ్బందితో స్థానికంగా సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విధానాలు తెలపాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రత్యేకాధికారులు వీరే...

మండలం	ప్రత్యేకాధికారి	హోదా
పద్మనాభం	జి. సూర్యప్రకాశరావు	జిల్లా పౌర సరఫరాల అధికారి
భీమునిపట్నం	ఎస్. భాస్కరరెడ్డి	ఆర్డీవో, భీమిలి
ఆనందపురం	టి. సీతారామ్మూర్తి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
విశాఖపట్నం రూరల్	జీవీఎస్ఎస్ రామమోహన్‌రావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
సీతమ్మధార	చక్రవర్తి	డీపీవో, జీవీఎంసీ
మహారాణిపేట	చంద్రిక	డీపీవో, జీవీఎంసీ
గోపాలపట్నం	పి. శేషశైలజ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
ములగాడ	టి. ప్రవీణ	జిల్లా కో-ఆపరేటివ్ అధికారి
గాజువాక	డి. లక్ష్మారెడ్డి	ఎస్టేట్ అధికారి, వీఎంఆర్డీఏ
పెదగంట్యాడ	డాక్టర్ వి.సన్యాసిరావు	అదనపు కమిషనర్, జీవీఎంసీ
పెందుర్తి	డి. హుస్సేన్ సాహెబ్	ఆర్డీవో విశాఖపట్నం

ఆక్రమణకు అడ్డుకట్ట



రామకృష్ణాపురంలో ఆక్రమణను తొలగిస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు అధికారులు అడ్డుకట్ట వేశారు. గ్రామంలో బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకొని ఓ వ్యక్తి జీవీఎంసీకి చెందిన సుమారు 120 చదరపు గజాల స్థలం ఆక్రమించి నిర్మాణ పనులు ప్రారంభించాడు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి శుక్రవారం సిబ్బందితో వెళ్లి ఆక్రమణను అడ్డుకున్నారు. మళ్లీ ఆ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆక్రమణకు గురైన స్థలాన్ని సామాజిక అవసరాల కోసం కేటాయించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.